

ఎస్‌పిగా అమిత్ బర్దర్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌పి అమిత్ బర్దర్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పిగా నియమితులైన అమిత్ బర్దర్ సోమవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. ముందుగా మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయానికి చేరుకొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యాలయంలోని తన చాంబర్లో ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా పటిష్టమైన వ్యూహంతో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. గంజాయి సాగు, రవాణాపై పటిష్టమైన నిఘా ఉంటుందన్నారు. కాగా బాధ్యతలు స్వీకరణకు వచ్చినన ఆయనకు స్థానిక ఎస్‌పి కార్యాలయ ఉద్యోగులు సాదరంగా స్వాగతించారు.

జిఒ 54ను వెనక్కు తీసుకోవాలి

- యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన
- గెజిట్ ప్రతుల దగ్ధం





దుంబ్రిగుడ, అనంతగిరిల్లో జిఒ54 ప్రతులను దగ్ధంచేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జిపిఎస్‌కు కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం ఈనెల 12న విడుదల చేసిన గెజిట్ జిఒ54ను వెంటనే వెనక్కి తీసుకోవాలని యుటిఎఫ్ నేతలు ఆందోళన చేపట్టారు. సోమ వారం మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహం వద్ద జిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. జిఒ 54కాపీలను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.రాజారావు, ఎస్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఉద్యోగులపై ప్రభుత్వాల వైఖరి మారడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత వైసిపి ప్రభుత్వం వారంరోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని నమ్మబలికి, దాన్ని అమలు చేయకపోగా, 2023అక్టోబర్ 20న మోసపూరితంగా జిపిఎస్‌ను తీసుకొచ్చిందన్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వం దానికి కొనసాగింపుగా గెజిట్ జారీ చేయడం దుర్మార్గమన్నారు.తక్షణమే జిఒ 54ను వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని 20ఏళ్లుగా పోరాటం జరుగు తున్నా ప్రభుత్వాలు దీనిపై సరైన నిర్ణయం తీసుకోక పోగా, రకరకాల జిఒలతో ఇబ్బందులకు గురిచేస్తు న్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కూటమి ప్రభుత్వ మైనా సిపిఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. జిల్లా కార్యవర్గసభ్యుడు ఎస్ కన్నయ్య, క్రార్యదర్శులు మేఘనాథ్ , అప్పలస్వామి, శ్యాంసుందర్, యస్ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతగిరి : జిపిఎస్‌ను కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం జారీచేసిన జిఒ 54ను రద్దుచేయాలని యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. జిఒ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.దేముడు మాట్లాడుతూ, జిపిఎస్ జిఒ 54ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పూర్వ సహ అధ్యక్షులు ఎస్.రాంబాబు, అనంతగిరి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి. ఈశ్వరరావు, బిడ్డ సింహచలం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. మల్లేశ్వరరావు, బి. విజయకుమార్, జె దేముడు, కార్యవర్గ సభ్యులు పంచాడి రామచంద్రరావు, జోగి గంగులు తదితరులు పాల్గొన్నారు

శిథిల కల్వర్టుతో కష్టాలు!

- పైకప్పుకు రంధ్రంతో రాకపోకలకు ఇక్కట్లు
- ఏ క్షణాన్నైనా కూలే ప్రమాదం
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణం
- తక్షణ మరమ్మతులకు గిరిజనం డిమాండ్



మర్రిపుట్టు వద్ద కల్వర్టుపై ఏర్పడిన భారీ రంధ్రం

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని మర్రిపుట్టు గ్రామం సమీపంలో ప్రధాన రహదారిలో కల్వర్టు పైకప్పు కూలి భారీ రంధ్రం ఏర్పడడంతో వాహనాలు రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు రంధ్రంతోపాటు ఇపుడు రెండువైపులా కూలడానికి సిద్ధంగా ఉండడంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నాఉ.

మర్రిపుట్టు గ్రామం సమీపంలో ఈ కల్వర్టు నిర్మాణం చేపట్టి సుమారు 40ఏళ్లు అవుతోందని స్థానికులు అంటున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఏళ్లనాటి ఈ కల్వర్టు పైకప్పు రంధ్రం ఏర్పడడంతోపాటు ఇరువైపులా శిథిలావస్థకు చేరుకుంటో ఇదే రహదారి మీద గుత్తులపుట్టు సంతకు వచ్చిపోయే వ్యాపారులు, గిరిజనులతోపాటు అటుగా దాదాపు 50గ్రామాల ప్రజలకు ఇదే ముఖ్యమైన రహదారి, అంతేకాక పెదబయలు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు కూడా అధికంగా ఉంటాయని స్థానికులు అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కల్వర్టు కూలితే, వాహన రాకపోకలన్నీ నిలిచిపోతాయని, కిలోమీటర్లు దూరం కాలినడకనే వెళ్లాల్సి వస్తుందని స్థానికులు భయపడుతున్నారు. గతంలో తారురోడ్డు నిర్మాణం చేపట్టినా, అప్పట్లో ఈ కల్వర్టు పునర్నిర్మాణం చేపట్టకపోవడంతో, ప్రస్తుతం రోడ్డు బాగానే ఉన్నా, కల్వర్టు కూలిపోతే వాహనదారులు వెళ్లేందుకుమార్గమే లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారుల స్పందించి, తక్షణమే కూలిన కల్వర్టు వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతోపాటు భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా కల్వర్టును పటిష్టంగా పునర్నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయుడిని నియమించరూ.!

- జెడ్‌పిటిసి గంగరాజును అభ్యర్థించిన చిన్నారులు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ
- లేకుంటే తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆందోళన



విద్యార్థులతో మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : పాఠశాలలు పున:ప్రారంభం నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో తమ చదువులు అటకెక్కి పోయాయని మండలంలోని చిలకలగెడ్డ వెంకాయపాలెంలోని విద్యార్థులు స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజును మొరపెట్టుకున్నారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకునేందుకు వెంకాయపాలెం గ్రామానికి వెళ్లిన గంగరాజును, అక్కడ విద్యార్థులు తమ గోడువెల్లబుచ్చుకున్నారు. దీనిపై స్పందించిన గంగరాజు, టీచర్ అవతారమెత్తి, రోజంతా విద్యార్థులకు బోధన చేస్తూ గడపడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశమై సమస్యలపై చర్చించారు.

ఈసందర్భంగా వెంకాయపాలెం గ్రామంలో 20మంది బడిఈడు పిల్లలున్నారని, పటిష్టమైన పాఠశాల భవనం ఉండడంతోపాటు చదువుకోవాలన్న ఆసక్తి ఉన్న చిన్నారులు, వారిని బడికి పంపించే చైతన్యంఉన్న తల్లిదండ్రులు ఉన్నప్పటికీ, పాఠాలు చెప్పే మాస్టారు లేకపోవడంతో వారి భవిష్యత్ అంధకారంగా మారుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు జెడ్‌పిటిసి గంగరాజు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను దూరాన ఉన్న చిలకగెడ్డ పాఠశాలకు పంపించలేమని, జాతీయ రహదారి మీదుగా పిల్లలను బడికి పంపించే సాహసం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్న ఊరిలో పాఠశాల ఉంటే, వేరేఊరికి పంపించాల్సిన దుస్థితి కల్పించడం సరికాదన్నారు. దీనిపై గంగరాజు స్పందించి, వెంకయ్యపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుడి నియామకానికి తనవంతు కృషి చేస్తానన్నారు. దీనిపై మండల విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం సర్పంచ్ కె. మొస్య, కె. సింగులు, దేవుడు, డానియేల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల కేంద్రంలో బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడడంతో సెల్ సిగ్నల్, ఇంటర్నెట్ సౌకర్యం లేక. నాలుగు రోజులుగా వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీనిపై ఈనెల 15న ప్రజాశక్తిలో సోమవారం 'మూగబోయిన బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు, సిగ్నల్ లేక అవస్థలు పడుతున్న వినియోగదారులు' శీర్షికతో ప్రచురితమై కథనానికి స్థానిక బిఎస్‌ఎన్‌ఎల్ అధికారులు స్పందించారు. సోమవారం టవర్ వద్దకు చేరుకుని, మరమ్మతులు చేపట్టి సిగ్నల్, ఇంటర్నెట్ సౌకర్యాలను పునరుద్ధరించారు. సిగ్నల్ పునరుద్ధ రించడంతో బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగ దారులు ఆనందం వ్యక్తం చేశారు.కాగా ఏజెన్సీలో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలకు తరచూ అంతరాయంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు

పోలవరం ముంపు బాధితుల సమావేశంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన అర్హులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన బాధితులతో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనం సమావేశం నిర్వహించారు. ముందుగా పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. ముంపు బాధితులకు భూమికి భూమి, డి-పట్టాలకు నష్టపరిహారం, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు, 18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు తదితర సమస్యలను నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రామాల వారీగా కమిటీలు వేస్తామన్నారు. భూమికి భూమి సమస్యల పరిష్కారానికి, డి-పట్టాలకు ప్యాకేజీ అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలవరం ముంపు బాధితుల సమస్యలను, పునరావాస కాలనీలను పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌డిసిలు అంబేద్కర్, మమ్మీ, తహశీల్దార్లు చలపతిరావు, సులోచన, డిటిలు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు, పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్ కుమార్‌ను భుజాలపై ఎక్కించుకుని మోస్తూ ఊరేగింపుగా తీసుకొస్తున్న గిరిజనులు

కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఘన స్వాగతం

రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సోమవారం రంపచోడవరంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన దినేష్ కుమార్‌కు రంపచోడవరం సాయినగర్ వద్ద స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో పలు గిరిజన సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. గిరిజన సాంప్రదాయ రేలా, కొమ్ము డాన్సులతో ఆయనను భుజాలపై ఎత్తుకొని ఊరేగింపుగా ఐటీడీఏ కార్యాలయం వరకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తే ఎటువంటి ఫలితం ఉంటుందో అనడానికి ఈరోజు తనకు పలికిన స్వాగతమే ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ దినేష్ కుమార్ గతంలో రంపచోడవరం పిఓగా పనిచేసినప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేశారని, ఆయనే మళ్లీ జిల్లా కలెక్టర్‌గా ఇక్కడి రావడం హర్షించేదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు మఠం భాస్కర్, గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం, సిఐటియు నేతల వినతి



కలెక్టర్‌కు పోలవరం నిర్వాసితుల సమస్యలను వివరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు పరిహారం వెంటనే అందించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిపిఎం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ నిర్వాసితులకు పరిహారం, పునరావసంపై తొలి నుండి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ముంపు మండలాల్లో లక్షలాది నిర్వాసిత కుటుంబాల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూమికి భూమి పంపిణీలో సారవంతమైన భూమి మాత్రమే ఇవ్వాలని, కాలనీలకు సమీపంలోనే భూములు కేటాయించాలని, ఎకరాకు రూ.20 లక్షల చొప్పున నిర్వాసితుల ఆధీనంలో ఉన్న అన్ని భూములకు నష్టపరిహారం చెల్లించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రస్తుత ధరలకు నాలుగు రెట్లు పెంచాలని, నష్టపరిహారం పూర్తిగా చెల్లింపు, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే గ్రామాలను తరలించాలని, నాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులందరికీ ప్యాకేజీ అమలు చేయాలని, రానున్న వరదల సమయంలో నిర్వాసితులను ఆదుకొనేందుకు రవాణా, ఆహారం, మంచినీరు, షెల్టర్, నిత్యావసర సరుకులు, వైద్యం అన్నీ అందుబాటులో ఉండేలా చూడాలని, దేవీపట్నం మండలంలో పెండింగ్ ఉన్న ఎల్‌టిఆర్ కేసులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను సిపిఎం నాయకులు కోరారు.

భూపతిపాలెం కెనాల్ బోదెకు మరమ్మతులు చేయాలి

భూపతిపాలెం రిజర్వాయర్ కెనాల్ బోదెకు మరమ్మతులు చేసి తమకు సాగునీరు అందించాలని పందిరిమామిడి, ఇర్లపల్లి, జాగరంపల్లి గిరిజన రైతులు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తం

గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో

- ఎత్తైన ప్రాంతంలో పాకల నిర్మాణం
- సామగ్రి తరలిస్తున్న మరికొంత మంది..




వడ్డి గూడెం నుండి తమ సామాగ్రిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- విఆర్.పురం

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతుండడంతో ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గోదావరి నదికి ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నదికి వరద తాకిడి నెమ్మదిగా పెరగటం మొదలైంది. భద్రాచలం సోమవారం ఉదయం నాటికి 13.4 అడుగులు ఉన్న గోదావరి, సాయంత్రం ఐదు గంటలకు 36.63 అడుగులకు చేరుకొని ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు గ్రామాల ప్రజలు ముందస్తుగా ఎత్తైన గుట్టలపై పాకలను నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే మండలంలోని జీడిగుప్ప పంచాయతీ పరిధిలోని 11 గ్రామాలు, శ్రీరామగిరి పంచాయతీలోని కల్తునూరు, చొక్కనపల్లి, శ్రీరామగిరి, సితంపేట, వడ్డిగూడెం పంచాయతీ వడ్డిగూడెం, వడ్డిగూడెంకాలనీ, రామవరం, అడివి వెంకన్నగూడెం, దిగువ గిరిజన కొండరెడ్లు గ్రామాల ప్రజలు కొండలపై పాకాలను వేసుకుంటున్నారు. మరికొంత మంది ఇంట్లో సామాగ్రి ట్రాక్టర్ల ద్వారా ముందస్తుగానే తరలిస్తున్నారు. వరద వస్తే రహదారులపై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్న కారణంతో మండలంలోని వడ్డిగూడెం ప్రజలు తమ సామాగ్రిని తీసుకొని రేఖపల్లి వెళ్తున్నారు. అధికారులు స్పందించి సహాయ చర్యలు చేపట్టాలని పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గుట్టలపైనా, అడవిలోనూ గుడారాలు ఏర్పాటు చేసుకున్న వారికి నిత్యావసర సరుకులు, బరకాలు, బియ్యం, కిరోసిన్, సోలార్ లైట్లు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



విఆర్.పురం మండలం అన్నవరం వద్ద వంతెన పైనుండి ప్రవహిస్తున్న వరద నీరు



నడిమివీధి - గొల్లపల్లి మధ్య పొంగి ప్రవాహిస్తున్న వాగులో వాహనంలో వెళ్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

గత వారం రోజుల నుంచి ఏజెన్సీలో విస్తీరంగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు ప్రమాదకరంగా పొంగి ప్రవహిస్తున్నాయి. జీకే వీధి మండలం అమ్మోరు దారకొండ పంచాయతీ పరిధి నడిమి వీధి- గొల్లపల్లి మధ్యలో వాగు పొంగి ప్రవహిస్తుంది. వాగు దాటాలంటే ప్రజలు తీవ్ర భయాందోళన గురవుతున్నారు. వాహనాలపై తప్ప వాగు దాటలేని పరిస్థితి నెలకొంది. ఒకానొక టైంలో వాగులో వాహనాలతో పాటు సైతం కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందని గిరిజనులు చెప్పారు.

విఆర్.పురం : మండలంలో పడిన వర్షాల ప్రభావంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి, అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు అన్నవరం వద్ద వాగు పొంగి వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత

- సమాచారమిచ్చి సహకరించాలి : ఎస్ఐలు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు :మండలకేంద్రంతో పాటు పలుగ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించుచున్నారని, వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ రవీంద్ర సూచించారు. అపరిచిత వ్యక్తులు ముఖ్యంగా రాత్రివేళల్లో సంచరిస్తుండడంతో వారు చోరీలకు పాల్పడేందుకు వచ్చారో, లేక అసాంఘిక శక్తులో తెలియని పరిస్థితి ఉందన్నారు. వీరిపై పోలీసుశాఖపరంగా పటిష్టనిఘా పెట్టినప్పటికీ, ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. ఇంట్లో విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఇదే సమయంలో గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాలలో్న అనుమాని తులను, జులాయిగా తిరుగుతున్న వారిని, చెడు అలవాట్లకు లోనైనా వారి సమాచారాన్ని పోలీసులకు 9440904233 నెంబరుకు అందజేసి సహకరించాలని ఎస్ఐ రవీంధ్ర కోరారు.

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ మోదసాయి నగర్ కాలనీ పరిధిలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ సూచించారు. విలువైన గృహాలలో అవకాశం ఉంటే సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానం వస్తే, పెదబయలు పోలీసుస్టేషన్ ఫోన్ నెంబర్ 9440904227, ఇతర పోలీసు సిబ్బంది మొబైల్ నెంబరు 94403 32756, 62811 14358, 7981329513లకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

ఏరియా ఆసుపత్రిలో నీటికి కటకట

- రన్నింగ్ వాటర్‌లేక కంపుగొడుతున్న మరుగుదొడ్లు
- అవస్థలు పడుతున్న రోగులు, సిబ్బంది


నీరు రాని కుళాయిని చూపిస్తున్న రామారావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ ఏరియా ఆసుపత్రిలో రోగులు వినియోగిస్తున్న బాతు రూంలో రన్నింగ్ వాటర్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకుడు కె రామారావు అన్నారు. వెంటనే రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పర్యటించి బాతురూంలో కుళాయిలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లేక అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్ల వాడకం తర్వాత వాటిని శుభ్రపరిచేందుకు అవసరమైన నీటి సదుపాయం లేకపోవడం వల్ల అధ్వానంగా మారడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. రోగాలు నయం కావాలని ఆసుపత్రికి వస్తే, ఇక్కడ నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులు వల్ల కొత్త వ్యాధులు వచ్చే పరిస్థితి ఉందని, ముఖ్యంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో రోగుల తాకిడి కూడా ఎక్కువగా ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించడమే కాకుండా, ఆసుపత్రిలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచాలని, డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులతో ఆసుపత్రిలో చేరిన రోగులకు తాగేందుకు మరగబెట్టిన నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపిటిసికి పతి వియోగం

అధిక రక్తపోటుతో విఆర్‌పి సింహాచలం అకాల మరణం


కొమ్ము సింహాచలం(ఫైల్)

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ఎంపిటిసి కొమ్ము రమ్య భర్త ఎన్ఆర్ఇజిఎస్ విఆర్‌పి కొమ్ము సింహాచలం (45) సోమవారం మరణించారు. సోమవారం సింహాచలం హఠాత్తుగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించారు.వైద్యపరీక్షలు నిర్వహించిన స్థానిక వైద్యాధికారి, రక్తపోటు నియంత్రణకు రావడం లేదని, వెంటనే పాడేరు ఆసుపత్రికి తరలించాలని రిఫర్ చేశారు. పాడేరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మృతుడు.కొమ్ము సింహచలం ఉపాధి హామీ పథకంలో విఆర్‌పిగా విధులు నిర్వహిస్తూనే, ప్రజా సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. టిడిపి సీనియర్‌గా పార్టీకి సేవలు అందించడంతో హుకుంపేట ఎంపిటిసిగా తన భార్యకు 2019 ఎన్నికల్లో సీటు సంపాదించడం, గెలిపించడం చేశారు. మృతునికి భార్య రమ్య, ఇద్దరు పిల్లలున్నారు. కాగా సింహాచలం అకాల మరణంతో ఎంపిటిసి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతుల కుటుంబాలను టిడిపి, సిపిఎం, ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు పలువురు అధికారుల పరామర్శించి,ప్రగాడ సానుభూతి తెలిపారు. మృతదేహానికి నివాళులర్పించారు. కాగా సింహాచలం అంత్యక్రియలు అతని స్వగ్రామమైన డాలి గుమ్మడిలో మంగళవారం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

వైద్య సేవల్లో డాక్టర్ నిర్లక్ష్యం

డయేరియా బాధిత చిన్నారులను రిఫర్ చేసి చేతులు దులుపుకున్నారు : బాధితుడు దేశభక్తుల స్వామి రమణ


వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు

ప్రజాశక్తి -సీలేరు

వాంతులు, విరోచనాలు, జ్వరంతో రాత్రి 11 గంటల సమయంలో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తన ఇద్దరు చిన్నారులను తీసుకెళ్తే వైద్యాధికారి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జీకే వీధి మండలం సీలేరులో నివాసముంటున్న దేశభక్తుల స్వామి రమణ ఆరోపించారు. స్వామి రమణ సోమవారం విలేకర్లకు తెలియజేసిన వివరాలు ప్రకారం... దేశభక్తుల స్వామి రమణ దంపతులకు ఇద్దరు కలవలు కుమారులు ఉన్నారు. రెండు రోజులుగా విరోచనాలతో బాధపడుతుండగా ఓ ప్రైవేట్ వైద్యుని వద్ద వైద్య సేవలు అందించారు. అయితే విరోచనాలు తగ్గకపోగా, వాంతులు, జ్వరం తీవ్రంగా ఉండడంతో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరు చిన్నారులను స్థానిక పిహెచ్‌సికి స్వామి రమణ దంపతులు తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వైద్యాధికారి లేకపోవడంతో స్టాఫ్‌నర్స్ వైద్యాధికారి సౌమ్యకు సమాచారం ఇచ్చారు. ఈ సమయంలో నిన్నెవరు ఫోన్ చేయమన్నారంటూ ఆమెపై వైద్యురాలు ఆగ్రహం వ్యక్తం చేసి, వారికి ఫోన్ ఇవ్వమని ఆదేశించారు. వెంటనే బాధితులకు స్టాఫ్ నర్స్ ఫోన్ ఇవ్వగా పగలు పూట తీసుకురావడం తెలియదా? అర్ధరాత్రి తీసుకురావడం ఏమిటీ అంటూ వైద్యాధికారి మండిపడ్డారు. వాంతులు, విరోచనాలు, జ్వరం తీవ్రతరం కావడంతోనే తీసుకొచ్చామని చెప్పగా, ఎట్టకేలకు వైద్యాధికారి సౌమ్య ఆసుపత్రికి వచ్చి మరోసారి బాధితులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తూతూ మంత్రంగా వైద్య సేవలు అందించి చేతులు దులుపుకున్నారు. పరిస్థితిని గమనించిన బాధితులు చిన్నారులకు ప్రాణాపాయస్థితి సంభవిస్తుందేమోనని భయపడి వెంటనే హెూటాహుటిన మెరుగైన వైద్య సేవల నిమిత్తం భద్రాచలం తరలించారు. దీంతో వారికి ప్రాణహాని తప్పింది.

వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి


అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై బాధితుడు దేశభక్తుల స్వామి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న పిల్లలకు వైద్యం అందించకుండా తమతో 30 నిమిషాల పాటు ఘర్షణకు దిగడం దారుణమన్నారు. సీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలు వైద్యం అందించాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఈ విధంగా వైద్యాధికారి వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దురుసుగా ప్రవర్తించి, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారి సౌమ్యపై కలెక్టర్, ఐటిడీపీ పిఓ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోపణల్లో నిజం లేదు : వైద్యాధికారి సౌమ్య



ఈ విషయంపై వైద్యాధికారి డాక్టర్ సౌమ్యను ప్రజాశక్తి వివరణ కోరగా రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని, దేశభక్తుల స్వామి రమణ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. పగటిపూట ఆస్పత్రికి వస్తే వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందించడానికి బాగుంటుందని తన అభిప్రాయం చెప్పినట్లు పేర్కొన్నారు. రోగులు ఏ సమయంలో పిలిచినా తాను అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వామి రమణ ఇద్దరు పిల్లలు గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యుడిని వద్ద వైద్య సేవలు పొందినట్లు తమకు తెలిసిందని చెప్పారు. ఆదివారం రాత్రి ఇద్దరు పిల్లల్ని ఆసుపత్రికి తీసుకురాగా తాను వెంటనే ఆసుపత్రికి వచ్చి అందుబాటులో ఉన్న మలేరియా టెస్టులు నిర్వహించి ప్రాథమికంగా వైద్యం అందించినట్లు చెప్పారు. మిగతా టెస్టులో అందుబాటులో లేకపోవడంతో చిల్డ్రన్స్ స్పెషలిస్ట్‌ని సంప్రదించాలని స్వామిరమణకు సూచించినట్లు డాక్టర్ సౌమ్య తెలిపారు.

వర్షానికి కూలిన పెంకుటింటి గోడ


కూలిన ఇంటిగోడ

ప్రజాశక్తి-జి.మాడుగుల : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లువాసింగి గ్రామంలో జర్ర సూరిబాబు అనే వ్యక్తికి చెందిన పెంకుటిల్లు గోడ పూర్తిగా కూలిపోయింది. ఘటన సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.దీంతో అందరూ ఊపిరి పిలుచుకున్నారు. ఉన్న గూడు కాస్తా కూలిపోవడంతో బాధితుడు ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వపరంగా ఐటిడిఎ ఆదుకోవాలని వేడుకుంటున్నాడు

కుక్కకాటుతో బాలునికి తీవ్రగాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుక్క కాటు బాధిత బాలుడు

ప్రజాశక్తి - చింతపల్లి : కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడిన గిరిజన బాలునికి వైద్యం అందించి మెరుగైన వైద్యసేవల కోసం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించామని జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మణిదీప్ అన్నారు. జీకే విధి మండలం మొండిగెడ్డ పంచాయతీ చెక్కలమద్ది గ్రామానికి చెందిన ఏడేళ్ల గిరిజన బాలుడు పాతుని తేజ్వల్ సోమవారం కుక్క కరిచింది. బాలునిపై కుక్క దాడిచేయడంతో తీవ్రగాయాలపాలైన ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. డాక్టర్ మణిదీప్ బాలుడిని పరీక్షించి, ప్రాథమిక చికిత్సను అందించి, తర్వాత చింతపల్లి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చింతపల్లి ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారి అజయ్ మెరుగైన వైద్యం అందిస్తున్నారు.


పిఒతో ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులు

ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-చింతూరు : ఇటీవల విడుదలైన ఐఐటి మెరిట్ జాబితాలో ఎంపికైన విద్యార్థులకు చింతూరు ఐటిడిఎ పిఒ సోమవారం నగదు బహుమతులు అందజేశారు. చింతూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.వసుంధర, పి.ఆదిలక్ష్మి ప్రియ, కూనవరం ఎపిటిడబ్ల్యూ బాలికల పాఠశాల విద్యార్థి బి.హర్షిత తదితరులకు పిఒ కావూరి చైతన్య ఒకొక్కరికీ రూ.2000 చొప్పున నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు. భవిష్యత్‌లో బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు ఆదివాసీ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలకృష్ణ, ఉపాధ్యాయులు సుబ్బయ్య, భద్రయ్య పాల్గొన్నారు.


డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించరూ..

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ సమీపంలో డ్రెనేజీ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడ డ్రైనేజీ లేక పశువ్యర్థాలు, ఇళ్లలోని వ్యర్థాలు చేరి నీరు వెళ్ళే మార్గం ఉండడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లడంతో తమ పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశముందని వాపోతున్నారు. గతంలో ఎంపీడీవో లాలం సీతయ్య చొరవ తీసుకున్నప్పటికీ సమస్య అసంపూర్తిగానే ఉందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని లేకుంటే స్కూల్‌లో చదివే పిల్లలు సైతం అంటు రోగాల బారిన పడే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

17న విశాఖ ఉక్కుపై సదస్సు

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఈ నెల 17న 'సంక్షోభంలో విశాఖ ఉక్కు - అధిగమించడం ఎలా' అన్న అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఉక్కునగరంలోని సంఘం కార్యాలయంలో ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సు పోస్టర్‌ను స్టీల్‌ప్లాంట్‌లోని స్టోర్ జంక్షన్ వద్ద వారు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికులలో అవగాహన, చైతన్యం కలిగించి, సరైన పోరాటాలను నిర్మిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఎదురైన సంక్షోభాలను ఎదుర్కోవడంలో స్టీల్ సిఐటియు ప్రధాన భూమిక పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉక్కుపై చైతన్యంతో కూడిన పోరాటాలు చేస్తేనే విజయం సాధ్యమన్నారు. గడిచిన కొంతకాలంగా స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ కేటాయించాలని పాదయాత్రలు, రక్తదానం తదితర కార్యక్రమాల ద్వారా చైతన్యం కలిగించామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ 17న జరిగే సదస్సుకు ముఖ్య వక్తలుగా స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి శివసాగర్‌రావు, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిహెచ్.నర్సింగరావు హాజరవుతారన్నారు.

పూరిగుడిసెలో చదువులు

భవనం లేక ఇబ్బంది పడుతున్న చాపరాతిపాలెం చిన్నారులు


పూరి గుడిసెలోనే చదువులు సాగిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం, ధాన్యం పాలెం పంచాయతీ, చాపరాతిపాలెం ఎంపీపీ పాఠశాలకు భవనం లేకపోవడంతో పూడి గుడిసెలోనే చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో 19 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. భవనం లేకపోవడంతో పూరి గుడిలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వస్తే చాలా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాకలోనైనా చదువుకుందామనుకుంటే, రాత్రిపూట పశువులు ఆ పాకలోనే పడుకుని, కాల కృత్యాలు తీర్చుకుంటున్నాయి. దీంతో ప్రతిరోజు ఉదయాన్నే విద్యార్థులు గాని, వారి తల్లిదండ్రులు గాని వాటిని శుభ్రం చేస్తున్నారు. తరాలు మారుతున్న తమ తలరాతలు మారడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాపరాతిపాలెం గ్రామం ఎక్కడో కొండల మీద దూర ప్రాంతంలోనూ లేదు. మండల కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఇక్కడి పాఠశాల భవనం కోసం పట్టించుకునే నాధుడే కొరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మా గ్రామానికి రహదారి, పాఠశాల భవనం, వైద్య సేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

తమ పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పెద్దర్కూర్ సర్పంచ్, ఎంపీటీసిలు ఎంపీపీటీసీ అమ్మాజి, నాగమణి సోమవారం చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండికొత్తగూడెం గ్రామానికి త్రీఫేస్ కరెంటు లైన్ ఏర్పాటు చేయాలని, పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీలోని అంతర్గత రోడ్లకు నిధులు విడుదల చేయాలని కోరారు. రేపాక గ్రామ మెట్ట రైతులకు ఉపయోగపడే చెక్‌డ్యాం నిర్మించాలని కోరారు. సుమారు 15 సంవత్సరాల క్రితం కూనవరం జడ్పిటిసి ఎంపీపీ మ్యాచింగ్ నిధులతో నిర్మించిన చెక్‌డాం పాడైపోయిందని, దానికి మరమ్మతులు చేయించి కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరు అందించే విధంగా చూడాలని కోరారు. కూటూరు గ్రామపంచాయతీలోని అంతర్గత రోడ్లు నిర్మించాలని, పెద్ద ఆర్కూర్ గ్రామం నుండి శబరి నది వైపు రైతులకు ఉపయోగపడే విధంగా కచ్చా రోడ్డును నిర్మించి కల్వర్టు కట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రాజెక్ట్ అధికారి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి-కొయ్యూరు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాడేరు నియోజకవర్గంలోని కొయ్యూరు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న సమస్యలపై ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. కాకరపాడు నుంచి కొయ్యూరు మధ్యలో కాలువలపై రెండు బ్రిడ్జిల లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, నాయకుడు మేడిబోయిన సత్తిబాబు. మహిళా నాయకులు బోణంగి సత్యవతి, గరెంగి రాజేశ్వరి, తోకల దేవి, లోతా సింహాచలం, పల్లి అప్పారావు కార్యకర్తలు పాల్గొన్నారు.



పల్లాను కలిసిన టిడిపి మండల నాయకులు


నేత్ర పరీక్షలకు హాజరైన విద్యార్థులు

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కంటి వైద్య నిపుణులు బి.సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. మండలంలో ఎస్ రామన్నపాలెం పాఠశాలలో 15 మంది విద్యార్థులకు, ఉప్పయపాలెం పాఠశాలలో 15 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్ష నిర్వహించగా అందరికీ కంటి చూపు సాధారణంగానే ఉన్నదని నిర్ధారించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసర ప్రాంతాలలో ప్రతిరోజు కంటి వైద్య పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు ఇవ్వడం జరుగుతుందని, ఆపరేషన్ అవసరమైన వారికి రిఫరల్ చేస్తామని పేర్కొన్నారు.

దబ్బకోటలో విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి దబ్బకోట గ్రామంలో ప్రయాణికుల కోసం విశ్రాంతి భవనం, చిన్నారులకు అంగన్వాడీ భవనం నూతనంగా ప్రభుత్వం మంజూరు చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు గోవిందరాజు కృష్ణ జగన్ కోరారు. ప్రస్తుతం ఉన్న ఈ రెండు భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, ఏ క్షణంలో కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న బస్సు షెల్టర్‌లో పిచ్చి తుప్పలు పెరిగిపోయాయని చెప్పారు. దబ్బకోట గ్రామంలో సుమారు 100 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని, అంగన్వాడీ, విశ్రాంతి భవనం లేదని ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు విచారం వ్యక్తం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రెండు భవనాల మంజూరు అయ్యేవిధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి బోరు వద్ద కాలువ నిర్మించాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో తాగునీటి బోరు వద్ద ప్లాట్‌ఫారం, కాలవ నిర్మాణం చేపట్టాలని టిడిపి నాయకులు వై.నూకరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు ఏపీ జెన్కో కాలనీవాసులు, వ్యాపారులు, పేదలు తాగునీటి కొరకు ప్రతిరోజు ఈ బోరుబావిని ఆశ్రయిస్తారని పేర్కొన్నారు. ఇది ప్రజలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. బోరు బావ దగ్గర ఉన్న ప్లాట్‌ఫారం శిథిలావస్థకు చేరుకుందని, వృధా నీరు వెళ్లడానికి మార్గం లేక బోరుబావి సమీపంలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. దీంతో బోరు బావి వద్ద వ్యర్థాలు కుళ్ళి దుర్వాసన కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బోరుబావి చుట్టుపక్కల ఉన్న తుప్పలను తొలగించి పరిశుభ్రపరచాలని, ప్లాట్‌ఫారం, కాలువ నిర్మాణం చేయాలని, దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ దుర్గో దృష్టి పెట్టాలని కోరారు.

బీమా రంగ సమస్యలపై మాట్లాడతా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపైనా, ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లపైనా తాను మాట్లాడతానని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ హామీ ఇచ్చారు. సోమవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ, ఐసిఇయు నాయకులు సతీష్, గోవింద్, శ్రీనివాసరావు, ఎవిఆర్‌కె.మూర్తి ఎంపీ శ్రీభరత్‌ను కలిసి బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఇన్సూరెన్స్ రంగంలో ఐపిఒ పెంపును విరమించి, బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఎత్తివేసేలా ప్రభుత్వంతో చర్చించి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ మీడియా ఇన్‌ఛార్జ్ ఎ.రామకృష్ణారావు పాల్గొన్నారు.